విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
గురువారం 12 మార్చి 2026

# పదవ తరగతి మోడల్ టెస్ట్ లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినంద సభ

- పరీక్ష అంటే భయం కాదు, నీ ప్రతిభను నిరూపించుకునే ఒక అద్భుతమైన అవకాశం!
- ఈ మోడల్ టెస్టులు అనేవి కేవలం మార్కుల కోసం కాదు,
- మీలో ఉన్న సామర్థ్యాన్ని మీకు పరిచయం చేయడానికి నిర్వహించినవి




అనంతపురం, మార్చి 11 (అనంత ప్రభ)

అనంతపురం పదవ. తరగతి మోడల్ టెస్ట్ లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా కార్యదర్శి ప్రతిభ భారతి, అధ్యక్షతన ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం డిప్యూటీ మేయర్ విజయ భాస్కర్ రెడ్డి గారు,ఆర్ట్స్కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్. నెమకల్లు రంగస్వామి ,పి. ఎస్. యఫ్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ ఆలం,ఐస్ఫ రాష్ట్ర అధ్యక్షులు నరసింహా , ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు కేశవ, అంజన్ రెడ్డి, శ్రీరాములు నాయక్, వారు మాట్లాడుతూ...విద్యార్థులలో పరీక్ష భయం లివెళ్లగొట్టలని పి. ఎస్. యఫ్.ఆధ్వర్యంలో పదవ. తరగతి మోడల్ టెస్ట్ గత నెల నిర్వహించడం జరిగింది.ఈ మోడల్ టెస్టులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆర్ట్స్కళాశాలలో 48 మంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు.పి. ఎస్. యఫ్.ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదవ తరగతి మోడల్ టెస్టును సద్వినియోగం చేసుకొని, త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు భయాందోళన పడకుండా మానసిక ధైర్యాన్ని నింపడానికి మోడల్ టెస్ట్ నిర్వహించడం జరిగిందనన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్ష రాసే విద్యార్థులు చాలా మందికి భయంగా ఉంటుంది. అందువల్ల ఆ భయాన్ని పోగొ ట్టడానికి విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా పరీక్ష రాసే విధంగా ముందస్తుగా ఇలాంటి పదవ తరగతి మోడల్ పరీక్షలు పెట్టడంవలన విద్యార్థులలో భయం పోతుందని తెలిపారు. పబ్లిక్ పరీక్షలు అనేవి మీ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. భయం వద్దు, కేవలం క్రమశిక్షణతో కూడిన ప్లాన్ ఉంటే చాలు. ఈ కొద్ది రోజులు సెల్ ఫోన్లకు, ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి పెడితే.. రేపు రిజల్ట్స్ వచ్చినప్పుడు మీ తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూస్తారు. ఆ ఆనందమే మీరు సాధించే అసలైన విజయం.మీ అందరిలోనూ గొప్ప విజేతలు ఉన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయండి.నేటి విద్యార్థులే రేపటి సమా జాన్ని మార్చే పౌరులుగా ముందుకు వెళ్లాలని పిలు పునిచ్చారు. అదేవిధంగా 2026 లో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష నందు ఉత్తీర్ణత శాతం మన జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కావున ప్రతి విద్యార్థి కూడా పబ్లిక్ పరీక్ష మంచిగా రాసి మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పి. ఎస్. యఫ్.జిల్లా నాయకులు శ్రవణ్, సంధ్య, ప్రసాద్ మరియు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నన్ను ముస్లిం మైనార్టీలకు దూరం చేయలేరు చిల్లర రాజకీయాలు మానుకోండి



అనంతపురం, మార్చి 11 (అనంత ప్రభ)

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తనను ముస్లిం మైనార్టీలకు ఎవరు దూరం చేయలేరని కొందరు పనిలేని రాజకీయ నిరుద్యోగులు ఇలాంటివి చేస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. లక్ష్మీ నగర్ లో టిడిపి నేత చేపలహారి నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. లక్ష్మీ నగర్ కు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు టిడిపి నాయకులు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరికి ఆయన రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ స్వయంగా భోజనం వడ్డించారు. ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన చేపలహారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీలు అత్యధిక శాతం ఉన్నారన్నారు. 120 మసీదుల్లో రంజాన్ సందర్భంగా మౌళిక వసతులు కల్పించినట్లు చెప్పారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న అనంత వెంకటరామిరెడ్డి కానీ, మేయర్ వసీం కానీ ఏ రోజు మైనార్టీల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అసలు వారు ఐదేళ్లలో ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. ఈ 20 నెలల్లోనే ముస్లిం సోదరులు ఎంతోమందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించినట్లు చెప్పారు. నగరంలో 130కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నానని అన్నారు. ఇవన్నీ జీర్ణించుకోలేని కొందరు రాజకీయ నిరుద్యోగులు నాపై కుట్రలు చేస్తున్నారన్నారు. ఒక మైనార్టీ నాయకుడు విషయంలో స్థానికంగా ఉన్న నేతలు గొడవపడితే.. దానిని నాకు ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తనను మసీదుల్లోకి ఆహ్వానించకూడదని ఎవరో ఒకరు చెప్పినంత మాత్రాన జరగదని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డి రంజాన్ తోఫాను కూడా ఎత్తివేసి పేద మైనార్టీలకు పండుగ రోజు కూడా సరుకులు అందకుండా చేశారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థికంగా లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## పర్యావరణాన్ని కొంప ముంచుతున్న ట్రాన్స్కో







- లో వోల్టేజ్ లైన్ పేరుతో ఆర్ఎంబి స్థలంలో చెట్ల తొలగింపు
- పట్టించుకోని పర్యావరణ, ఫారెస్ట్, ఆర్ అండ్ బి అధికారులు

కూడేరు, మార్చి 11 (అనంత ప్రభ )

అనంతపురం జిల్లా బళ్లారి హైవేపై సుమారుగా 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కూడేరు మండల కేంద్రం వరకు రహదారికి ఇరువైపులా ఎన్నో ఏళ్లుగా పెరిగిన చల్లని నీడ నిచ్చే పచ్చని చెట్ల బాటసారుల శ్రేయస్సు కోసం రహదారులకు ఇరువైపులా చెట్టు నాటాలనే అశోక్ చక్రవర్తి సంకల్పానికి ఏపీ విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టర్లు ఏకమై అశోక్ చక్రవర్తి ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు.కూడేరు మండలంలో లో వోల్టేజ్ సమస్యను ఆసరా చేసుకుని 33 కెవి లైన్ లాగుతూ యదేచ్ఛగా నేషనల్ హైవే రోడ్డుప్రక్కన ఉన్నటువంటి చెట్లను తొలగించే ప్రక్రియ చేపట్టారు. విషయం ఏమిటంటే హైవే రోడ్డు కు సరిహద్దుల్లో లైన్ వేయకుండా సరిగా చెట్ల మీద నూతన హెచ్ టి లైన్లను లో వోల్టేజ్ సమస్య పేరుతో విద్యుత్ శాఖ 33 కెవి లైన్ లాగుతూ యదేచ్ఛగా నేషనల్ హైవే రోడ్డుప్రక్కన ఉన్నటువంటి చెట్లను తొలగిస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. ఎవరైనా ఎందుకు చెట్లను తొలగిస్తున్నారని ప్రశ్నిస్తే నియోజకవర్గ పెద్దల పేర్లు చెప్పుకుంటూ.. లో వోల్టేజ్ సమస్యను తీర్చాల్సింది రాజకీయనాయకులే కదా అంటూ కాంట్రాక్టర్లు నాయకుల పేర్లు చెప్పుకుంటూ చెట్లను అక్రమంగా తొలగిస్తు కార్యకలాపాన్ని సాగిస్తున్నారు. ప్రభుత్వం.... లో వోల్టేజ్ సమస్యను తీర్చడం కోసం లక్షల లక్షల రూపాయలు వెచ్చిస్తూ టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు ఒప్ప చెప్పడం ఆనవాయితి అదే క్రమంలోని హై వోల్టేజ్ లైన్ వేయాలంటే సాధారణంగా ఎన్ హెచ్ హైవే రహదారి స్థలాన్ని వదిలి విద్యుత్తు లైను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలా వేయాలంటే హైవే ప్రక్కన అనుకుని ఉన్నటువంటి రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాల్సి వస్తుందని హైవే స్థలంలో ఎన్నో ఏళ్లుగా ఉన్నటువంటి చెట్లు కరెంటు లైన్ లాగడం కోసం అధికారులు కాంట్రాక్టర్లు ఏకమై యదేచ్ఛగా చెట్లను తొలగిస్తూ పర్యావరణనికి హాని కలిగిస్తూ విద్యుత్ లైన్ కు అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారన్నదే సమస్యాత్మకంగా మారింది. ఎంత ప్రజా ప్రయోజనాల కోసమైనా ఎంత అధ్వానంగా పర్యావరణాన్ని దెబ్బతీసే అనుమతులు కూడా ఇస్తారాని మండల ప్రజలు వాపోతున్నారు.

## మొదటి రోజే 1245 మంది 14 సం, బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్



తాడిపత్రి, మార్చి 11 (అనంత ప్రభ)

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ,పట్టణ ఆరోగ్యంద్రాలోనూ, ప్రాంతీయ ఆసుపత్రుల నందు, కమ్యూనిటీ ఆసుపత్రుల నందు మొత్తం 1245 మంది 14 సంవత్సరంల బాలికలకు వ్యాక్సిన్ వేయడం జరిగింది. ఇందులో భాగంగా తాడిపత్రి ఏరియా ఆసుపత్రి నందు జరిగిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు అస్మిత్ రెడ్డి గారు లాంచనంగా ప్రారంభించారు అలాగే వ్యాక్సిన్ వేయించుకున్న అమ్మాయిలకు ప్రశంస పత్రాన్ని అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్చార్జ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ నాగ శశి భూషణ్ రెడ్డి.జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ డేవిడ్, ఆర్ ఎం ఓ డాక్టర్ కృష్ణవేణి,స్థానిక కౌన్సిలర్ పర్వీన్ ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ డిఎంహెచ్వో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో16,449 మంది 14 సంవత్సరాలలోపు బాలికలను గుర్తించడం జరిగిందని వీరందరికీ కూడా వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని ఈ వ్యాక్సిన్ కార్యక్రమం ప్రతిరోజు అన్ని ప్రభుత్వ ఆసుపత్రి నందు వేయడం జరుగుతుందని కావున జిల్లాలో ఉన్నటువంటి 14 సంవత్సరంలోపు బాలికలు వారికి అందుబాటులో ఉన్నటువంటి ఆసుపత్రికి వెళ్లి తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని తద్వారా క్యాన్సర్ నివారణ సాధ్యపడుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

## మీ భద్రత... మా బాధ్యత...బాల్య వివాహాలు, సైబర్ మోసాలు, పై అవగాహన



పుట్టపర్తి, మార్చి 11 (అనంత ప్రభ)

మీ భద్రతే.. మా బాధ్యత అంటూ జిల్లాలో బాల్య వివాహాలు, సైబర్ మోసాలు,పై పోలీసులు అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు, పాఠశాలలు, మహిళలు విద్యార్థినిలకు సమావేశాల ద్వారా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు.

ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు అధికారులు, శక్తి టీం బృందా గ్రామాలు, పాఠశాలలు, రద్దీ ఉన్న ప్రాంతాలను సందర్శిస్తున్నారు.

మహిళా నేరాలు, పోక్స్ నూతన చట్టాలు వంటి వాటిపై పాఠశాలలు మరియు రద్దీగా ఉన్న ప్రాంతాలలో మహిళలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

ఈ కార్యక్రమాల్లో ముఖ్యంగా పోలీస్ సేవలపై, విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ మోసాల నుండి జాగ్రత్తలు, రోడ్డు భద్రత నియమాల గురించి వివరించారు.

అదే విధంగా శక్తి యాప్, డయల్ 112 , చైల్డ్ లైన్ 1098, సైబర్ హెల్ప్ లైన్ 1930 టోల్ ఫ్రీ నంబర్ల వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈవ్ టీజింగ్, డ్రగ్స్ దుష్ప్రభావాలు, బాల్య వివాహాల నిరోధ చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళల పై జరిగే నేరాల పై కూడా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు శక్తి టీం బృందాలు పాల్గొన్నారు.

## యర్రపల్లి గ్రామంలో కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం



పెనుకొండ, మార్చి 11 (అనంత ప్రభ)

యర్రపల్లి గ్రామంలో కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమంను నిర్వహించి, గ్రామ ప్రజలను పలకరించిన మాజీమంత్రి, శ్రీసత్యసాయిజిల్లా వైఎస్ఆర్సిపిజిల్లాఅధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి ఉషశ్రీ చరణ్

ఈరోజు శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండల కేంద్రంలోని నార్సింపల్లి పంచాయతీ యర్రపల్లి గ్రామం నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి గడపగడపకు వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ, నాడు జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజలకు ఏ లోటు లేకుండా ప్రతి కుటుంబానికి ప్రతి ఏడాది సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు, ఇప్పుడున్న ఈ కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్య పెట్టే విధంగా లేనిపోని హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ప్రజలను తీవ్రంగా అన్యాయం చేశారని ప్రతి ఒక్కరికి వివరించిన మాజీ మంత్రివర్యులు, శ్రీ సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి ఉషశ్రీ చరణ్ గారు..

ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల ప్రజా ప్రతినిధులు, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు మరియు నర్సింపల్లి పంచాయితీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## నేడు యాడికిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు



యాడికి, మార్చి 11 (అనంత ప్రభ)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15 వసంతాలు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో తాడపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు నేడు యాడికిలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంజీవ రాయుడు తెలిపారు.నేడు ఉదయం 10 గంటలకు యాడికిలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9.30 గంటలకు యాడికి వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయానికి ప్రజా ప్రతినిధులు, రైతులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు మరియు వైఎస్సార్ కుటుంబ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంజీవ రాయుడు కోరారు

## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, మార్చి 11(అనంత ప్రభ )

యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు జిల్లా వాస్తవ్యులు జి. రామాంజనేయులు, భార్య గంగమ్మ, కుమార్తె రోహిణి, కుమారుడు దినేష్ కుటుంబ సభ్యులు, తమ కుమార్తె రోహిణి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.దూర ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ పెద్దల ఆశీస్సులు పొందాలనే సంకల్పంతో అగాపే ఆశ్రమాన్ని ఆశ్రయించి అక్కడ నివసిస్తున్న నిరాశ్రయులు, వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు, నిరాశ్రయులు ఆనందంగా భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ స్థాపకుడు బత్తల ప్రసాద్ రోహిణికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, సేవా భావంతో అన్నదానం నిర్వహించిన వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు

## నాగనాథనహళ్లి గ్రామంలో ఘనంగా కోలంపురం అవ్వ -- పెద్దమ్మ అవ్వ ఊరు దేవర కార్యక్రమం



ఆదోని, మార్చి 11 (అనంత ప్రభ)

ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో కోలంపురం అవ్వ మరియు పెద్దమ్మ అవ్వ ఊరు దేవర కార్యక్రమం గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు మరియు టిడిపి నాయకుల ఆహ్వానం మేరకు టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగమయ్యారు. గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో రంగస్వామి నాయుడు, రంగన్న, మండల అధ్యక్షుడు శివప్ప, అయ్యన్న, సుబ్బారెడ్డి, చరణ్, నర్సప్ప, రామకృష్ణ తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ సంప్రదాయాలను కాపాడుతూ నిర్వహించిన ఈ ఊరు దేవర కార్యక్రమం భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై దేవతలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామ శాంతి, సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు

## కౌతాళం మండలం బాపూరం గ్రామంలో మారికాంబ దేవి



మంత్రాలయం, మార్చి 11 (అనంత ప్రభ)

కౌతాళం మండలం బాపూరం గ్రామంలో నిర్వహించిన శ్రీ మారికాంబ దేవి కుంభోత్సవాల్లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు తిక్కా రెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవి ఆశీస్సులు పొందారు.

ఉరుకుంద ఈరన్న మాజీ టెస్ట్ బోర్డ్ చైర్మన్ బాపూరం శివ మోహన్ రెడ్డి ఆహ్వానంతో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా, పూజా కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించబడినాయి.

ఈ కార్యక్రమంలో కాశీ విశ్వనాథ్, సుబ్రహ్మణ్యం రాజు, కోసిగి భరద్వాజ్ శెట్టి, సీతారామ రెడ్డి, మాధవరం కృష్ణమోహన్ రెడ్డి, అబ్దుల్ రహిమాన్ సిద్దు, పుగ్గి నాగప్ప, తోవి గణేష్ తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.


## బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్ పి వి టీకా



యాడికి, మార్చి 11(అనంత ప్రభ)

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హెచ్‌పీవి వ్యాక్సిన్ కార్యక్రమం బుధవారం యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాడికిలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం జరిగింది. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశ-య ముఖద్వార క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్) వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వైద్యులు తెలిపారు. బాలికల ఆరోగ్య రక్షణకు ఈ టీకా ఎంతో కీలకమని వారు వివరించారు. వ్యాక్సిన్ ఇవ్వడానికి ముందు పిల్లల తల్లిదండ్రుల నుంచి అనుమతి పొందిన తర్వాతనే టీకాలు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల తల్లిదండ్రులు కూడా సానుకూలంగా స్పందించి తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమానికి యాడికి తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శశికళ ముఖ్య అతిథులుగా హాజరై టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. బాలికల ఆరోగ్య పరిరక్షణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సీహెచ్ఓ జుబేదా, పీహెచ్ఎన్ శోభకుమారి, మేల్ సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్,ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు,ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

## ఎండను సైతం లెక్కచేయకుండా చురుగ్గా సాగుతున్న రీ సర్వే




కూడేరు, మార్చి 11 (అనంత ప్రభ)

కూడేరు మండల పరిధిలోని గొటుకూరు రెవిన్యూ నందు రీ సర్వే అధికారులు భూ సమగ్ర రీసర్వే కార్యక్రమాన్ని వేగవతంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్ సూచన మేరకు గ్రామ సర్వేయర్లు వీఆర్వో వీఆర్ఏలు గొటుకూరు ప్రాంతంలో రైతుల భూ సమస్యల పరిష్కార దిశగా ఎండను సైతం లెక్కచేయకుండా గత నెల రోజులుగా గొటుకూరు ప్రాంత భూ సర్వే కార్యక్రమాన్ని చురుకుగా సాగిస్తున్నారు. రీ సర్వే కార్యక్రమంలో రైతుల పొలాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ చేయడం కోసం మొదటిగా ఆయా ప్రాంత రైతులకు నోటీసులు, వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం తెలియజేస్తూ సమగ్ర భూ సర్వే ను నిర్వహిస్తూ ఉన్నారు. రీ సర్వే అధికారులు సర్వే నిర్వహిస్తున్న సమయంలో రైతులు తమ దగ్గర ఉన్నటువంటి భూమికి సంబంధిత ఆధారాలను చూపిస్తూ భూములు సర్వే చేయించుకోవాలని అలాగే రీ సర్వే అధికారులకు రైతుల ప్రతి ఒక్కరు సహకరించి సర్వే నంబర్ల ప్రాతిపదికన ఎవరి పొలాల్లో వారి ఉంటూ సర్వే చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కుల్లాయి స్వామి, గ్రామ సర్వేయరు సుజాతబాయి, విశాల్ , వీఆర్ఏ జ్ఞానేష్, ఓబన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎన్.రాజశేఖర్



అనంత, మార్చి 11 (అనంత ప్రభ)

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి సూచనల మేరకు అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి అయిన ఈ. భీమారావు ఆదేశాల మేరకు బుధవారం రోజున అనంతపురము లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ కళాశాల బాలికల వసతిగృహం ×, ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖశ బాలిక వసతి గ్రహం మరియు సాంఘిక సంక్షేమ బాలిక వసతి గృహం లను ఆకస్మిక తనిఖి చేసినారు. వంటగదుల్ను బాలికలకు అందుతున్న వసతులు గురుంచి విచారించారు. అనంతరం బాలికలకు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఆడపిల్లలకు చదువు పట్ల జిజ్ఞాసను పెంచి వారి అభివృద్ధిని మరియు హితోదికంగా వారి కుటుంబ శ్రేయస్సును కోరుకుందాం అన్నారు. ఈ బాల్య వివాహాలు అన్న దురాచారం పట్ల అందరూ అవగాహన కలిగి ఇలాంటి వాటి పట్ల జాగరుకతతో ఉండి మెరుగైన సమాజం ఎదుగుదలకు మన వంతు తోడ్పడదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

## నాగన్నతహాళ్లిలో ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొన్న కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ




ఆదోని, మార్చి 11 (అనంత ప్రభ)

నాగన్నతహాళ్లి గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించిన కొల్లాపురమ్మ అవ్వ దేవర మరియు వాల్మీకి నగర్‌లో జరిగిన పెద్దమ్మ అవ్వ దేవర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. గ్రామంలోని టిడిపి నాయకులు, గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ఆమె ఈ కార్యక్రమాలకు విచ్చేసి భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేవతలను దర్శించుకుని గ్రామ ప్రజల సుఖసంతోషాలు, శాంతి సమృద్ధి, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాల్లో ఇలాంటి సంప్రదాయ ఆధ్యాత్మిక వేడుకలు నిర్వహించడం వల్ల సమాజంలో ఐక్యత పెరుగుతుందని, పూర్వీకుల సంప్రదాయాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.గ్రామ ప్రజలు ఆమెను హర్షాతిరేకంగా స్వాగతించి ఘనంగా సత్కరించారు. ప్రజలతో కలిసి ఆమె మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని ఆమె హామీ ఇచ్చారు. నాయకత్వంలో ప్రజలతో సాన్నిహిత్యంగా ఉండటం ఆమె ప్రత్యేకత అని స్థానిక నాయకులు ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మదిలే భాస్కర్ రెడ్డి, రామచంద్ర, గోపాల్ రెడ్డి, రామకృష్ణ, ఓంకార్, రాజశేఖర్, రాఘవరెడ్డి, వీరేష్, చిన్న చిట్టి, కృష్ణతో పాటు టిడిపి నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఆదోని నారాయణ పాఠశాలలో స్టూడెంట్ లేడ్ కాన్ఫరెన్స్ ప్రారంభం



ఆదోని, మార్చి 11 (అనంత ప్రభ)

ఆదోని నారాయణ పాఠశాలలో ఈ రోజు స్టూడెంట్ లేడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమం మొదటి రోజున యూకేజీ తరగతి విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించి తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు.

ఈ కార్యక్రమానికి ఒకటో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఏజీఎం రమేష్ మరియు కిడ్స్ కోఆర్డినేటర్ జైబా పాల్గొన్నారు. కార్యక్రమానికి పా-ఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ రెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ముందుకు తీసుకువచ్చే అవకాశాన్ని కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రేపు 12-03-2026న ఎల్‌కేజీ విద్యార్థులకు, 13-03-2026న నర్సరీ విద్యార్థులకు కూడా స్టూడెంట్ లేడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.కిడ్స్ కోఆర్డినేటర్ జైబా మాట్లాడుతూ తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల ముందుకు వచ్చి మాట్లాడటం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు.

ఏజీఎం రమేష్ మాట్లాడుతూ స్టూడెంట్ లేడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాలు విద్యార్థులను పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఆలోచించేలా ప్రోత్సహిస్తాయని, విద్యార్థులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సృజనాత్మకంగా ప్రదర్శించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు

## జేబీఎన్ న్యూస్ క్యాలెండర్లను ఆవిష్కరించిన తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్ రెడ్డి మరియు ఎస్ఐ ధరణి బాబు



తాడిపత్రి, మార్చి 11 (అనంత ప్రభ)

జేబీఎన్ న్యూస్ క్యాలెండర్లను తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్ రెడ్డి మరియు ఎస్ఐ ధరణి బాబు చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను భుజాన వేసుకొని ప్రజల పక్షాన ప్రభుత్వ అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెల్లడమే కాకుండా ఆ సమస్యల పరిష్కారానికి మార్గదర్శకంగా నిలుస్తూ అన్ని వర్గాల ప్రజల మెప్పులు పొందుతున్నదని అభినందించారు. మరియు నిజాలు నిర్భయంగా రాయగల "అనంత ప్రభ " దినపత్రిక మరిన్ని కథనాలతో ప్రజలకు మంచి సందేశాన్ని అందించాలని కోరారు.

## రఘురామ్ మృతదేహానికి నివాలర్పించిన దండు శ్రీనివాసులు



శింగనమల, మార్చి 11 (అనంత ప్రభ )

శింగనమల మండల కేంద్రంలోని చిన్నకాలవవీధిలో నివసిస్తున్న మాజీ ఆర్మీ మ్యాన్ రఘురామ్ రాయల్ గత కొద్దిరోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న శింగనమల మార్కెట్ యార్డ్ చైర్మన్ దండు శ్రీనివాసులు రఘురామ్ మృతదేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘురామ్ కుటుంబానికి టిడిపి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని వారికి ఏ అవసరం వచ్చిన తనను నిరభ్యంతరంగా కలస వచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది

## కావూరి సాంబశివరావు మృతికి 'అనంత' సంతాపం



అనంతపురం, మార్చి 11 (అనంత ప్రభ )

మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు మృతికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి సంతాపం తెలియజేశారు. ఐదు సార్లు ఎంపీగా పని చేసిన కావూరి సాంబశివరావు.. యూపీఏ హయాంలో కేంద్ర మంత్రిగా కూడా ఉన్నారని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తాను అనంతపురం ఎంపీగా ఉన్నానని, కావూరితో తనకు ప్రత్యేక అనుబంధం ఉండేదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో తన పదవికి రాజీనామా చేశారని, ఆ తర్వాత క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారని తెలిపారు. కావూరి మరణంతో ఏపీ రాజకీయాల్లో ఒక అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోయామని తెలిపారు. కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వ రంగ సంస్థలు, ఆటో మొబైల్, పరిశ్రమల అభివృద్ధికి కావూరి కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన మరణం బాధాకరమని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు

## కేజీబీవీ లో నూతన విద్యా సంవత్సరానికి బాలికలు దరఖాస్తు చేసుకోండి



కూడేరు, మార్చి11 (అనంత ప్రభ)

కూడేరు మండలంలోని కస్తూర్బా గాంధీ విశ్వవిద్యాలయం నందు 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు విద్యార్థినిలకు నోటిఫికేషన్ వెలువబడినట్లు కేజీబీవీ ప్రిన్సిపల్ ఉమాదేవి తెలిపారు. ఈనెల 12వ తేదీ నుండి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని కూడేరు కేజీబీవీ నందు 6 వ తరగతికి 40 సీట్లు ,10 వ తరగతికి 1 సీటు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపిసి 40 సీట్లు, రెండవ సంవత్సరం 6 సీట్లో ఖాళీ ఉన్నాయని ఆసక్తిగల విద్యార్థినిలు ప్రభుత్వ నిబంధనల మేరకు కేజీబీవీలో సీట్ల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఉమాదేవి తెలిపారు.

## నేడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కూడేరు, మార్చి 11 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలోని గురువారం 12-3-2026 చేసిన ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ పార్టీ అభిమానులు, అనుబంధ సంఘం నాయకులు వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు పెద్ద ఎత్తున కదిలి వచ్చి కార్యక్రమం విజయవంతం చేయాల్సిందిగా జిల్లా వైస్సార్సీపీ యువజన విభాగం కార్యదర్శి, వైస్ ఎంపీపీ దేవాఆంజనేయులు తెలియజేశారు







## మలబద్ధకంతో ముప్పుతిప్పలు పడుతున్నారా? ఈ ఆయుర్వేద చిట్కాలు పాటించండి

### త్రిఫల చూర్ణం

మలబద్ధకం నుంచి ఉపశమనాన్ని కలిగించే అత్యంత ప్రభావవంతమైన ఆయుర్వేద నివారణల్లో త్రిఫల చూర్ణం ఒకటి. వేడి నీటిలో దీన్ని కలుపుకుని త్రిఫల టీని తయారుచేసుకోవచ్చు. అర టీ స్పూన్ ధనియాలు, పావు టీ స్పూన్ యాలకులు పొడి చేసుకుని త్రిఫల చూర్ణంతో పాటు ఒక గ్లాసు నీటిలో కలుపుకుని తాగొచ్చు. పేగు కదలికలు బాగుండేలా చేస్తుంది.

వేయించిన సోంపు గింజలు

ఒక గ్లాసు గోరు వెచ్చని నీటిలో ఒక టీ స్పూన్ వేయించిన లేదా పొడి చేసిన సోంపు గింజలు కలపాలి. వీటిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. ఆరోగ్యకరమైన పేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. గ్యాస్ట్రిక్ ఎంజైమ్ లను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది.

### బేల్ పండు గుజ్జు

వెలగక్కాయని బేల్ పండు అని కూడా పిలుస్తారు. ఇది మలబద్ధకం సమస్యని నివారిస్తుంది. సాయంత్రం భోజనానికి ముందు అరకప్పు బేల్ పండు గుజ్జు, ఒక టీ స్పూన్ బెల్లం కలిపి తినాలి. బేల్ రసంలో కొద్దిగా చింతపండు నీళ్ళు, బెల్లం కలిపి షర్బత్ లాగా చేసుకుని తీసుకోవచ్చు. దయాబెటిక్ బాధితులైతే ఈ పండు తినే ముందు వైద్యుని సలహా తీసుకోవాలి. ఇది ఎక్కువ మోతాదులో తీసుకోకూడదు. ఎందుకంటే కడుపుని మరింత ఇబ్బంది పెడుతుంది.

## డయాబెటిస్ ఉన్నవారు పరగడుపున ఖాళీ పొట్టతో తినాల్సిన ఫుడ్స్ ఇవే



రోజంతా శరీరం ఉత్తేజంగా పని చేయాలంటే పరగడుపున తినే ఆహారం ముఖ్య పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు అల్పాహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి. వారు పొట్ట నిండడమే కాదు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలో నెమ్మదిగా విడుదల చేసే ఆహారాలను ఎంపిక చేసుకోవాలి. అల్పాహారంలో షుగర్ స్థాయిల అధికంగా చేసే ఫుడ్ ను తింటే రోజంతా ఇబ్బంది పడాల్సి వస్తుంది. మధుమేహం ఉన్నవారు ఉదయానే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను అధికంగా కలిగి ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే మన కాలేయం అదనపు గ్లూకోజ్‌ని ఉత్పత్తి చేస్తుంది. మీకు దాహంగా అనిపించినా, అతిగా మూత్ర విసర్జన చేసినా, ఉదయాన్నే చూపు మందగించినట్టు అనిపించినా... మీ రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉన్నట్టు లెక్క. కాబట్టి ఆహార పరంగా జాగ్రత్తలు తీసుకోవాలి. పరగడుపునే తినాల్సిన సూపర్ ఫుడ్స్ ఇవే.

1. ఉదయాన పరగడుపున ఒక స్పూను ఆవు నెయ్యిలో చిటికెడు పసుపు పొడి కలుపుకొని తినేయాలి. ఇది మీ రక్తంలో చక్కెర స్థాయిలను పెరగకుండా రోజంతా కాపాడడంలో ముందుంటుంది. అలాగే తీపి పదార్థాలు తినాలన్న కోరికలను కూడా నియంత్రిస్తుంది. నెయ్యి పొట్ట నిండిన భావనను పెంచితే, పసుపు శరీరంలో ఇన్ఫ్లమేషన్ ను తగ్గిస్తుంది.

2. ఒక టేబుల్ స్పూన్ ఆపిల్ సిడర్ వెనిగర్ తాగిన మంచిదే. లేదా ఒక స్పూన్ ఉసిరి రసం తాగిన ఉత్తమమే. ఇది లేకుంటే గ్లాసు నీటిలో నిమ్మరసం కలిపి పరగడుపున తాగేయండి. ఈ ద్రావకాలు శరీరంపై ఆల్కలైజింగ్ ప్రభావాన్ని చూపిస్తాయి. శరీరాన్ని ఆల్కలీన్‌గా ఉంచడానికి ఈ ద్రవ పదార్థాలను ఎంచుకోవచ్చు.

3. దాల్చిన చెక్క వల్ల మధుమేహాలుకు ఎంతో ఉపయోగం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే ఒక మసాలా. రోజంతా రక్తంలో చక్కెర స్థాయిలు నిర్వహించడానికి ఇది ఎంతో సహాయపడుతుంది. దాల్చిన చెక్కతో టీ చేసుకుని తాగితే మంచిది.

4. మెంతి నీరు మధుమేహాలకు నిజంగానే సూపర్ ఫుడ్. దీన్ని తీసుకోవడం వల్ల శరీరం కార్బోహైడ్రేట్లను శోషించుకోకుండా కాపాడుతుంది. ఒక టీ స్పూన్ మెంతి గింజలను రాత్రంతా నానబెట్టి ఉదయం లేచాక ఆ నీటిని తాగేయాలి. ఆ గింజలను కూడా నమిలి మింగేయాలి. ఇలా నెల రోజులు చేస్తే చాలు పూర్తిగా అదుపులోకి వచ్చేస్తుంది.

## వారానికోసారి బాడీ మసాజ్ చేయించుకుంటే ఈ సమస్యలన్నీ మాయం

మనదేశంలో బాడీ మసాజ్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. కానీ వాటికి వెళ్లే వారి సంఖ్య తక్కువే. కేవలం ధనవంతులు మాత్రమే బాడీ మసాజ్ సెంటర్లకు వెళుతూ ఉంటారు. బాడీ మసాజ్ అంత అవసరం లేదని అనుకుంటూ ఉంటారు చాలామంది. నిజానికి బాడీ మసాజ్ మన శరీరానికి చాలా అవసరం. ఇది ఎన్నో ఆరోగ్య సమస్యలను కట్టడి చేస్తుంది. వారానికి ఒక్కసారి బాడీ మసాజ్ చేయించుకున్నా చాలు, ఎన్నో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.



%ఒత్తిడి

మసాజ్ చేయడం వల్ల శరీరంలోని కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయి. ఈ కార్టిసోల్ హార్మోన్ వల్లే ఒత్తిడి అధికంగా అనిపిస్తుంది. మనకి ఏదైనా ఒత్తిడిగా అనిపించింది అంటే శరీరంలో కార్టిసోల్ హార్మోన్ ఉత్పత్తి అవుతోందని అర్థం. ఈ హార్మోన్స్ స్థాయిలను తగ్గించడం ద్వారా ఒత్తిడి, మానసిక ఆందోళనలను అదుపులో ఉంచవచ్చు. ఫలితంగా మనసు శరీరం, రిలాక్స్ గా ఉంటాయి.

కండరాల నొప్పి

బాడీ మసాజ్ చేయడం వల్ల శరీరం మొత్తం రక్తప్రసరణ సవ్యంగా జరుగుతుంది. శరీరానికి ఆనందాన్,ని ప్రశాంతతను అందించే ఎండార్ఫిన్ హార్మోను విడుదల చేయడానికి బాడీ మసాజ్ సహకరిస్తుంది. దీనివల్ల కండరాల ఒత్తిడి, నొప్పి తగ్గుతాయి. ఇది శారీరక ఆరోగ్యానికి మంచిది.

నిద్ర కోసం

నిద్రపోయే ముందు మసాజ్ చేయించుకుంటే ఎంతో ప్రశాంతంగా నిద్ర పడుతుంది. బాడీ మసాజ్ చేయించుకున్న వారికి నిద్ర నాణ్యత ఎక్కువ. శరీరం, మనసు రెండూ ప్రశాంతంగా ఉంటాయి. కనుక నిద్ర కూడా సంపూర్ణంగా పడుతుంది. ఆందోళన, ఒత్తిడి లాంటివి ఉండవు.

రోగనిరోధక శక్తికి

బాడీ మసాజ్ చేయడం వల్ల రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఇవి ఒత్తిడి హార్మోన్ ను తగ్గించడమే కాదు తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతాయి. తెల్ల రక్త కణాల సంఖ్య పెరగడం వల్ల మన రోగనిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది. తక్కువ అనారోగ్యాలకి గురవుతారు. అందుకే వారానికి ఒకసారైనా కచ్చితంగా మసాజ్ చేయించుకోవాలి.

అలసట తగ్గి...

బాడీ మసాజ్‌లు వారానికి రెండు లేదా మూడుసార్లు చేయించుకుంటే మానసికంగా అలసట తగ్గుతుంది. మెదడుకు రక్త ప్రవాహం పెరుగుతుంది. దీనివల్ల ఆలోచనల్లో, నిర్ణయాల్లో స్పష్టత పెరుగుతుంది. దృష్టి మెరుగుపడుతుంది. ఉత్పాదకత, సృజనాత్మకత లాంటివి పెరుగుతాయి.

ఆపరేషన్ చేయించుకున్నాక శరీరం మొత్తం మళ్లీ సవ్యంగా రక్తప్రసరణ చేయడానికి బాడీ మసాజ్ ఉపయోగపడుతుంది. గాయాల వల్ల కలిగే నొప్పి నుంచి ఈ మసాజ్ ఉపశమనం లభిస్తుంది.

## డ్రైఫ్రూట్స్ చిక్కీ, ఇంట్లోనే ఇలా చక్కగా చేసేయండి

**కావాల్సిన పదార్థాలు, బాదం పప్పులు - పదిహేను**
**జీడిపప్పులు - పది, పిస్తా పప్పులు - పది**
**గుమ్మడి గింజలు - మూడు స్పూన్లు, ఎండు నల్ల ద్రాక్షలు - పది**
**నువ్వులు - నాలుగు స్పూన్లు, బెల్లం తురుము - ఒక కప్పు**
**నీళ్లు - సరిపడా, నెయ్యి - ఒక చెంచా**

కావాల్సిన పదార్థాలు

1. బాదం పప్పులు, జీడిపప్పులు, పిస్తాలు, ఎండు నల్లద్రాక్షలు సన్నగా తరుక్కోవాలి.
2. స్టవ్ మీద కళాయి పెట్టి డ్రై ఫ్రూట్స్‌ని వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి.
3. ఇప్పుడు అదే కళాయిలో ఒక చెంచా నెయ్యి వేయాలి. అందులో ఒక కప్పు బెల్లం, కాస్త నీరు వేసి బాగా కలుపుకోవాలి.
4. బెల్లం పాకం వచ్చేలా తయారయ్యాక అందులో ముందుగా వేయించిపెట్టుకున్న నట్స్ తో పాటూ, వేయించిన నువ్వులు, గుమ్మడి గింజలు కూడా వేసి బాగా కలపాలి.
5. ఒక పళ్లానికి అడుగున నెయ్యి రాసి అందులో ఈ మిశ్రమాన్ని పోయాలి.
6. కాస్త గోరువెచ్చగా ఉన్నప్పుడు ముక్కలుగా చాకుతో కోసి, ఎండాక ముక్కలు తీసి ఒక డబ్బాలోదాచుకోవాలి. అంతే పోషకాల చిక్కీ రెడీ అయినట్టే.

చలికాలంలో డ్రైఫ్రూట్స్ తినడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ కాలంలోనే రోగనిరోధక శక్తి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల ఆ శక్తి పెరుగుతుంది. ఈ సీజన్లో వచ్చే ఎన్నో అనారోగ్యాలకు ఇవి చెక్ పెడతాయి. ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్ అధికంగా ఉంటాయి. శరీరంలో రక్తప్రసరణను, హిమోగ్లోబిన్ స్థాయిలను మెరుగుపరుస్తాయి. వీటిలో ఫ్లేవనాయిడ్స్, యాంటీ యాక్సిడెంట్లు క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకుంటాయి. ఫ్రీరాడికల్స్ తో పోరడతాయి.



## మిగిలిన ఉప్మాతో టేస్టీగా బోండాలు, పిల్లలకు నచ్చేస్తాయి

ఇంట్లో ఉప్మా చేస్తే చాలా వరకు మిగిలిపోతుంది. కారణం ఎక్కువమందికి నచ్చకపోవడమే.అలా ఉప్మా మిగిలిపోయినప్పుడు పడేయకుండా బోండాలు చేసుకుని తింటే బావుంటాయి. పిల్లలకు ఇవి బాగా నచ్చుతాయి. ఉప్మా తినని పిల్లలకు ఇలా బోండాలు చేసి పెడితే తినేస్తారు. ఆలూ బోండాలాగే ఉప్మా బోండాలు కూడా చాలా రుచిగా వస్తాయి.

**కావాల్సిన పదార్థాలు**
**వండిన ఉప్మా - రెండు కప్పులు**
**బియ్యప్పిండి - రెండు స్పూన్లు**
**కారం - అర టీస్పూను**
**వాము - అర టీస్పూను**
**బేకింగ్ సోడా - పావు టీస్పూను**
**శెనగపిండి - ఒక కప్పు**
**నీళ్లు - తగినన్ని**
**ఉప్పు - రుచికి సరిపడా**
**నూనె - వేయిండానికి సరిపడా**
**కొత్తిమీర తరుగు - రెండు స్పూన్లు**

తయారీ ఇలా


1. ఉప్మా మీకు నచ్చిన విధంగా వండుకోవాలి. చల్లారాక వాటిని ఉండలుగా చుట్టుకోవాలి.
2. ఇప్పుడు ఒక గిన్నెలో శెనగపిండి, బేకింగ్ సోడా, బియ్యప్పిండి, వాము, కారం, ఉప్పు వేసుకుని బాగా కలపాలి.
3. కొంచెం కొంచెం నీళ్లు కలుపుకుని ఉండలు కట్టకుండా కలపాలి. బోండాలు వేసుకోవడానికి వీలుగా చిక్కగా కలుపుకోవాలి.
4. కొత్తిమీర తరుగు కూడా వేసి బాగా కలపాలి.
5. స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి.
6. నూనె వేడెక్కాక రుబ్బులో ముంచుకున్న ఉప్మా ఉండల్ని తీసి నూనెలో వేసి వేయించాలి.
7. ఇవి వేడిగా ఉన్నప్పుడు తింటే మంచి రుచిగా ఉంటాయి.

ఉప్మా అనే పదం ఉప్పు, మావు అనే రెండు తమిళ పదాల నుంచి పుట్టింది. అదే తెలుగు ఉప్మాగా మారింది. ఉప్మాను కొంతమంది బొంబాయి రవ్వతో చేస్తే, మరికొందరు గోధుమ నూకతో చేస్తారు. ఉప్మా తినడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. ఇది తినడం వల్ల చాలా త్వరగా జీర్ణం కాదు. పొట్ట నిండుగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఉప్మా మంచి ఎంపిక.

AP 4PG 12 - 3- 2026 thursday qxp_Layout 1 12-03-2026 06:26 AM Page 4



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మొటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..


ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచిది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్ట్స్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ..పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికి.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్ట్స్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com